క్లుప్తంగా

అపార్థం చేసుకోవద్దు

బీఆర్‌ఎస్ నాయకుడు క్యామ మల్లేశ్

మంచాల: ఈనెల 18న ఆరుట్ల గ్రామంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచార సభలో ఎవరినీ కించపర్చే విధంగా మాట్లాడలేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాను బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిగా, అంబేడ్కర్ వాదిగా ఎప్పుడు, ఎవరినీ, ఏ పార్టీని విమర్శించలేదన్నారు. కొందరు తనపై ఆరోపణలు చేసినట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. అపార్థం చేసుకొని మనస్సు నొప్పించుకోవద్దని సూచించారు.

శంభో శంకర..



ఆమనగల్లులోని పాత శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆమనగల్లు: కార్తీకమాసం సందర్భంగా శివాలయాలన్నీ భక్తులతో కిటకటలాడుతున్నాయి. ఈ కార్తీకమాసం పర్వదినంలో శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీ మామూలుగా ఉండదు. ఈ మేరకు ఆమనగల్లు పట్టణంలోని పలు ఆలయాలకు కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. పట్టణంలోని భక్తమార్కండేయస్వామి ఆలయం, పాత శివాలయాలను కార్తీకమాసం నేపథ్యంలో అలంకరించారు. ఉదయాన్నే శివుడికిఅభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోలీసులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఇన్‌స్పెక్టర్ నాగార్జున

చైతన్యపురి: పోలీస్ సిబ్బంది విధి నిర్వహణతో పాటు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ నాగార్జున అన్నారు. రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశాల మేరకు సోమవారం చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఓజోన్ ఆసుపత్రి వైద్య బృందం స్టేషన్‌లోని అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది ఆహారం, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, ఏవైనా సమస్యలుంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యం ఫిట్‌గా ఉంటేనే విధులు నిర్వహించ గల్గుతామన్నారు.

కాంగ్రెస్‌వి అమలు కాని హామీలు

- ఆ పార్టీ మేనిఫెస్టోపై మంత్రి సబితారెడ్డి ఫైర్
- కందుకూరులో ఎన్నికల ప్రచారం



కందుకూరు: తిమ్మాపూర్‌లో ప్రచారం చేస్తున్న మంత్రి సబితారెడ్డి

కందుకూరు: కాంగ్రెస్ పార్టీ ఇచ్చే హామీలు నమ్మితే మోసపోతారని విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డి ఆరోపించారు. పార్టీ టికెట్లు అమ్ముకున్న కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వస్తే రాష్ట్రాన్నే తాకట్టు పెడతారని ఎద్దేవా చేశారు. మండలంలోని సరస్వతిగూడ, లేమూరు, తిమ్మాపూర్, జబ్బార్‌గూడ, బేగంపేట, అగర్‌మియాగూడ, రాచులూరు, బైరాగిగూడ, కొత్తూర్ గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తుందన్నారు. నిత్యావసర సరకులు విపరీతంగా పెంచిన బీజేపీ ఏ మొహం పెట్టుకుని ప్రజల ముందుకు వస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇస్తున్న హామీలను ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. కేవలం అధికారాన్ని పొందాలన్న కాంక్షతో సాధ్యంకాని హామీలు గుప్పిస్తున్నారన్నారు. పింఛన్ రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచనున్నామని, గ్యాస్ సిలిండర్‌ను రూ.400లకే అందిస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. మోకాలు చిప్ప ఆపరేషన్లు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయిస్తున్నామన్నారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం సరఫరా చేయనున్నామన్నారు. తాము ఇచ్చే అన్ని హామీలను నూటికి నూరు శాతం అమలు చేస్తామన్నారు. ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని, కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం గుమ్మడవెల్లితో పాటు పలు గ్రామాల నుంచి పలువురు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జయేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, గణేష్‌రెడ్డి, చంద్రశేఖర్, విజేందర్‌రెడ్డి, శోభాగౌడ్, సర్పంచులు రాము, పరంజ్యోతి, గోపాల్‌రెడ్డి, సుగుణమ్మ, గోవర్ధన్, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి ఎంపీటీసీలు యాదయ్య, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం: అమీర్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



దిల్‌సుఖ్‌నగర్: ఎన్టీఆర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మహేశ్వరం పరిధిలో

మహేశ్వరం: సబితమ్మ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే భారీ మెజార్టీతో గెలిపిస్తాయని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కల్వకోల్ గ్రామ సర్పంచ్ గాదె థామస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సబితారెడ్డికి మద్దతుగా మండలంలోని కల్వకోల్, కేకే బస్తీ, అమీర్‌పేట్, నాగారం, దుబ్బచర్ల, ఘట్టుపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సబితారెడ్డి రూ.వందల కోట్ల నిధులతో ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి 75 గజాల ఇంటి స్థలం, డబుల్ బెడ్ రూమ్స్, దళిత బంధు కింద రూ.10 లక్షల సహాయం అందించారన్నారు. సబితమ్మ గెలుపును ఎవరూ ఆపలేరన్నారు.

పథకాల ఘనత బీఆర్‌ఎస్‌దే

దిల్‌సుఖ్‌నగర్: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత బీఆర్‌ఎస్‌దే అని ఆ పార్టీ మహేశ్వరం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో సోమవారం సబితారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి కోరారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, ఫరీద్‌పాషా, శ్రీనివాస్‌ముదిరాజ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘పట్నం’ గడ్డ మంచిరెడ్డి అడ్డా

- ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నంరూరల్: ఇబ్రహీంపట్నం గడ్డా బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అడ్డా అని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడు, మెటిల్లా గ్రామాల్లో కృపేష్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్ గ్రామంలో ఎమ్మెల్యే కుమార్తె శీతల్ ప్రచారం నిర్వహించారు. అభివృద్ధికి మారు పేరైన మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కప్పపహాడ్ సర్పంచ్ హంసమ్మ, ఎంపీటీసీ భరత్‌రెడ్డి, ఉప సర్పంచ్ మునీర్, నిట్టు జగదీశ్వర్, ఎల్మినేడులో ఎంపీపటేల్‌గూడ పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్సింహాలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మంచిరెడ్డి మౌనిక ప్రచారం

మంచాల: మండల పరిధిలోని చిత్తాపూర్ గ్రామంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోడలు మంచిరెడ్డి మౌనిక సోమవారం ఉదయం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి కిషన్‌రెడ్డి చేసిన కృషిని గుర్తించి మరోసారి ఎమ్మెల్యేగా అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమెతో పాటు మంచాల ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, సర్పంచ్ బొడ్డు నాగరాజ్ గౌడ్ మహిళలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన జుట్టు శ్రీశైలం

యాచారం: బీజేపీ రాష్ట్ర నాయకుడు జుట్టు శ్రీశైలం సోమవారం కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. శ్రీశైలంతో పాటు పలువురు కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించిన పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాశ్చ భాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఇబ్రహీంపట్నం 1వ వార్డు, 158 పోలింగ్ బూత్ పరిధిలో సోమవారం బూత్ ఇన్‌చార్జి కంచకట్ల భాస్కర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు గడప గడపకూ వెళ్లి ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్, కిషన్‌రెడ్డి ఇబ్రహీంపట్నంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ.. మంచిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.



కప్పపహాడ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మంచిరెడ్డి శీతల్

బీజేపీతోనే సుపరిపాలన సాధ్యం



మహేశ్వరం: ప్రచారం చేస్తున్న బీజేపీ జిల్లా కార్యదర్శి యాదయ్య గౌడ్

- జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్య గౌడ్



తుక్కుగూడ: సమావేశంలో రచ్చ లక్ష్మణ్

మహేశ్వరం: బీజేపీతోనే సుస్థిర, సుపరిపాలన జరుగుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్య గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పెండ్యాలలో బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో సీఎం కేసీఆర్ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు చేపడుతున్నారన్నారు. అవినీతి పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించాలని కోరారు. మహేశ్వరంలో బీజేపీ గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ గౌడ్, మాధవచారి తదితరులు పాల్గొన్నారు.

పాలనలో బీఆర్‌ఎస్ విఫలం

- బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్

మీర్‌పేట: మంత్రికి శిలాఫలకాలపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదని బీజేపీ మహేశ్వరం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. సోమవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్‌లోని శ్రీరామ ఆలయం నుంచి జిల్లెలగూడ వరకు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గల్లీకో బెల్టుషాపు, విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు జరుగుతున్నా కట్టడి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది బీజేపీ అని గుర్తుచేశారు. ప్రచారంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మీర్‌పేట అధ్యక్షుడు నర్సింహా, ప్రధాన కార్యదర్శులు మధు, సోమేశ్వర్ నాయకులు దశరథ, సబిత, అమర్‌నాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, పద్మనర్సింహ, భీంరాజ్, భిక్షపతిచారి, కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములును గెలిపించండి

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌కు మద్దతుగా సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో గోవా ఎమ్మెల్యే కేదార్ జయప్రకాశ్ నాయక్‌తో కలిసి స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఇంటింటి ప్రచారం చేశారు.



హుడాకాంప్లెక్స్: భగత్‌సింగ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న గోవా ఎమ్మెల్యే జయప్రకాశ్ నాయక్

స్థానికుడికే పట్టం

తుక్కుగూడ: మహేశ్వరం ప్రజలు పట్టం కట్టాలని బీజేపీ తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ కోరారు. రావిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్ ఇద్దరూ చేవెళ్ల వాసులున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకుమార్, యాదగిరిరెడ్డి నాయకులు భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

తుక్కుగూడ: మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌ను గెలిపించాలని కౌన్సిలర్ వై.శివకుమార్ ప్రచారం నిర్వహించారు. రావిర్యాల 4వ వార్డులో కమలానికి ఓటు వేయాలని కోరారు.

బీఆర్‌ఎస్, బీజేపీలను చిత్తుగా ఓడిస్తాం



మహేశ్వరం: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్లార్



మహేశ్వరం: కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

- ఎన్నికల్లో ఆ పార్టీలకు భంగపాటే
- మంత్రి అనుచరుల ఆగడాలు శ్రుతిమించాయి
- ఆ ప్రచార కార్యక్రమాల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్
- హస్తం గూటికి పలువురు నాయకులు

మహేశ్వరం: మహేశ్వరంలో బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పెండ్యాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మాజీ జెడ్పీటీసీ జంగయ్య, మాజీ ఉప సర్పంచ్ హన్మంత్ రెడ్డి, ఉప సర్పంచ్ ఎండి.గౌస్‌లతో పాటు పలువురు నాయకులు కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్శితులై బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. మంత్రి సబితారెడ్డి అనుచరులు మహేశ్వరంలో భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు దందాలు చేసి పేదల కడుపుకొట్టారని ఆరోపించారు. మంత్రి అనుచరుల ఆగడాలు మితిమీరిపోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అర్హులకు ఇవ్వకుండా బీఆర్‌ఎస్ నాయకులకే ఇచ్చారన్నారు. పార్టీ మారిన సబితారెడ్డిని చిత్తుగా ఓడించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు గెలుపొంది అధికారంలోకి రాబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతరెడ్డి, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వర్ నాయకులు బాల్‌రాజ్, అంజయ్య, మహేందర్‌రెడ్డి, శివ, బాలకృష్ణ, కృష్ణనాయక్, పాండునాయక్, రాజునాయక్, రాజు, ప్రవీణ్, కుమార్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో జోరుగా ఎన్నికల ప్రచారం

మహేశ్వరం: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏక కాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని మహేశ్వరం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఆకన్‌పల్లి, ఘట్టుపల్లి, ఘట్టుపల్లి తండా, కల్వకోల్, పెండ్యాల, డబిల్‌గూడ, మన్సాన్‌పల్లి, కొత్త తండా, ఉప్పుగడ్డ తండాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ కుటుంబ పాలన, ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెందారన్నారు. ఈసారి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. సోనియమ్మ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఓడిపోతామని మరోసారి సెంటిమెంట్‌తో రెచ్చగొట్టి ప్రజలను తప్పుదొవ పట్టిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన సబితారెడ్డి అధికార దాహం, డబ్బుల కోసం బీఆర్‌ఎస్‌లో చేరిందన్నారు. కన్నతల్లిలాంటి కాంగ్రెస్ పార్టీని మోసం చేసిన సబితారెడ్డిని ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా నడుస్తుందని 80 స్థానాలకుపైగా గెలుపొంది అధికారంలోకి వస్తామన్నారు. అధికారంలోకి రాగానే పేద ప్రజల అభ్యున్నతికి ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. పేదల బాగు కోసం బీఆర్‌ఎస్ సర్కార్ ఏమాత్రం కృషి చేయలేదన్నారు. మండలంలోని మన్సాన్‌పల్లి, మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లను స్థానికులకు ఇవ్వకుండా, మంత్రి పాతబస్తీకి చెందిన స్థానికేతరులకు ఇచ్చిందన్నారు. దళిత బంధు, బీసీ బంధు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఇచ్చారన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ వంట గ్యాస్ ధర పెరిగితే పట్టించుకోకుండా మళ్లీ అధికారంలోకి వస్తే రూ.400కు సిలిండర్ ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతరెడ్డి, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, మాజీ జెడ్పీటీసీ జంగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వర్ నాయకులు హన్మంత్‌రెడ్డి, గౌస్, రాజు నాయక్, మహేందర్‌రెడ్డి, కృష్ణనాయక్, రాజు, ప్రవీణ్, పాండునాయక్, శ్రీశైలం, గణేష్, కృష్ణయ్య, బాల్‌రాజ్, గణేష్ సీపీఐ నాయకులు దత్తు నాయక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విజయానికి కృషి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఖిల్లా మైసమ్మ దేవాలయం మాజీ చైర్మన్ పగిళ్ల భూపాల్ రెడ్డి సోమవారం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. అనంతరం భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మారెడ్డి గెలుపునకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

కాంగ్రెస్ గెలుపు తథ్యం

కందుకూరు: మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని మహ్మద్‌నగర్, బేగరికంచె, పోచమ్మతండా, సార్లరావులపల్లి, పోతుబండ తండాల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌కే ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్, నాయకులు సత్యనారాయణ, మల్లేష్, రాణాప్రతాప్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, సులేమాన్, జగన్, కృష్ణ, పాండు, ప్రభాకర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రవీందర్, శ్రీనునాయక్, గణేష్, సురేందర్, గణేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

తుక్కుగూడ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని మహేశ్వరం నియోజకవర్గ ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్లార్ ప్రకటించారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల, మంఖాల్, ఇమామ్‌గూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు. అమరవీరుల ఆత్మ బలిదానాలతో వచ్చిన తెలంగాణలో సీఎం కుటుంబ సభ్యులకు మాత్రమే లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. హస్తం గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బడంగ్‌పేట మేయర్ పారిజాత నర్సింహ్మారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా మేనిఫెస్టో

దిల్‌సుఖ్‌నగర్: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ మేనిఫెస్టో ఉందని ఆ పార్టీ ఆర్‌కేపురం డివిజన్ మాజీ మహిళా అధ్యక్షురాలు తమలపాకుల హర్షలత పేర్కొన్నారు. మహేశ్వరంలో కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం డివిజన్‌లోని చిత్రలేఅవుట్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి కాంగ్రెస్ పార్టీలో గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తగ్గిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో శకుంతల, శిరీష చౌదరి, నిర్మల రెడ్డి, నీలిమ, ఉషారాణి, బాలమణి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. సోమవారం మండలంలోని తోల్‌కట్ట సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ నెల 18న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 67వ ఎస్‌జీఎఫ్ రంగారెడ్డి జిల్లా లెవల్ టోర్నమెంట్, కామన్ సెలక్షన్స్ 2023–24 నిర్వహించారు. ఈ పోటీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో లాంగ్ జంప్ అండర్–17 విభాగంలో రక్షిత(8వ తరగతి) 3వ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. అలాగే, అండర్–14 విభాగంలో ఎస్.వైష్ణవి(7వ తరగతి) అథ్లెటిక్స్ 100, 200 మీటర్ల విభాగంలో 2వ స్థానంలో వెండి పతకం సాధించగా లాంగ్ జంప్‌లో రెండవ స్థానంలో నిలిచింది. గెలుపొందిన రక్షిత, వైష్ణవిలను రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమాదేవి

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్

- ప్రిన్సిపాల్ కాంచన లత

చేవెళ్ల: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు ధన్వంతరి ట్రస్ట్, జియో ఫైబర్ కంపెనీల ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీయర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ.. గుండెపోటు సంభవించినప్పుడు చేపట్టే సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ కాంచనలత మాట్లాడుతూ.. డిగ్రీ చదువుతునే విద్యార్థులు ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించవచ్చునని తెలిపారు. జియో ఫైబర్ కంపెనీలో విద్యార్థులు పార్ట్‌టైంగా ఉపాధి పొందే అవకాశాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ‘పిల్లల కోసం’ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా 73 మంది విద్యార్థులు దీనిపై శిక్షణ పొందినట్లు చెప్పారు. వీరిలో 41 మంది విద్యార్థులను వివిధ పాఠశాలలకు కేటాయించారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ ఎన్. జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్, జియో ఫైబర్ సంస్థ ప్రతినిధులు